రహదారులకు మహర్దశ



నిర్మాణంలో ఉన్న కాళీపట్నం- పాతపాడు రహదారి



మోళ్లపర్రు నుంచి కేపీపాలెం బీచ్ వరకు పూర్తయిన రహదారి

- రూ.75 కోట్ల నిధుల మంజూరు
- సుమారు 90 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం

మొగల్తూరు: నియోజకవర్గంలోని ప్రధాన రహదారులకు మహర్దశ పట్టనుంది. చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గతంలో తీరప్రాంత గ్రామాల్లోని పుంత రోడ్లను జాతీయ విపత్తు నివారణ పథకంలోని నిధులతో అభివృద్ధి చేశారు. నరసాపురం మొగల్తూరు మండలాల్లో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారులను అభివృద్ధి చేయనున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సుమారు 95 కిలోమీటర్ల రహదారులను రూ.75 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే కొన్ని రహదారుల పనులు ప్రారంభం కాగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. లక్ష్మణేశ్వరం నుంచి పీఎంలంక రూ.20 కోట్లు, నరసాపురం టౌన్ నుంచి కరింశెట్టివారిమెరక వయా లక్ష్మణేశ్వరం, సారవ రూ.7 కోట్లు, బియ్యపుతిప్ప మోళ్ళపర్రు వయా వేములదీవి, పీఎంలంక రూ.4.30 కోట్లు, నరసాపురం పీతానివారి మెరక వయా లక్ష్మణేశ్వరం, వైఎస్‌పాలెం, రామన్నపాలెం రూ.2.70 కోట్లు, ముత్యాలపల్లి, మోళ్లపర్రు వయా మోడి, పేరుపాలెం రూ28 కోట్లు, కొత్తోట, కోమటితిప్ప, వయా వెంప, కాళీపట్నం,రూ.9 కోట్లు, మెట్రీవు, అల్లంవారిమెరక నుంచి పేరుపాలెం బీచ్ వరకు రూ.8 కోట్లతో రహదారులను అభివృద్ధి చేయనున్నారు. కాళీపట్నం పడమర నుంచి జగన్నాథపురం వయా పాతపాడు వరకు రహదారి నిర్మాణంతో పాటు రెండు వరుసల వంతెన నిర్మాణానికి మంజూరైన రూ.12కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులు పూర్తకాగా, రహదారి పనులు కొనసాగుతున్నాయి. మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్ నుంచి బేతపూడి వరకు వయా వెంప రహదారికి మంజూరైన రూ.12.64 కోట్లతో చేపట్టిన పనులు ప్రారంభమయ్యాయి,



కాళీపట్నం కాలువపై నిర్మించిన వంతెన

మరిన్ని రహదారుల అభివృద్ధి



ఇప్పటికే కోట్లాది రూపాయలతో రహదారులు, వంతెనలు నిర్మించాం. ఇటీవల విడుదలైన రూ.75 కోట్లతో సుమారు 90 కిలోమీటర్ల మేర రహదారి పనులను చేపట్టబోతున్నాం. నియోజకవర్గంలోని మరికొన్ని రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– ముదునూరి ప్రసాదరాజు, చీఫ్‌విప్

గ్రామాభివృద్ధికి ప్రసాదరాజు కృషి



కాళీపట్నం గ్రామం అభివృద్ధికి ప్రసాదరాజు కృషి ఎనలేనిది. నియోజకవర్గంలోని గ్రామాలపై అవగాహన ఉండటంతో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తికాగా, రహదారి, ఆసుపత్రి పనులు కొనసాగుతున్నాయి.

– కపురు ఆదినారాయణ

27న నరసాపురం మున్సిపల్ బడ్జెట్ సమావేశం

నరసాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఈ నెల 27న ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ఆమోదంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి. ఉదయం 10:30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ స్వీకరిస్తారని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందించాలని కోరారు.

శాండ్ బెడ్ వాకింగ్ ట్రాక్ ప్రారంభం

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వాటర్ ట్యాంక్ చుట్టూ నూతనంగా నిర్మించిన శాండ్ బెడ్ వాకింగ్ ట్రాక్‌ను కళాశాల అధ్యక్షుడు సాగి ప్రసాదరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు సహజ సిద్ధమైన ఇసుక నేలలపై రోజులో కనీసం 15 నిమిషాలు వాకింగ్ చేస్తే రక్త ప్రసారం బాగా జరిగి సంపూర్ణ ఆరోగ్యంతో మంచి ఆలోచనలు వస్తాయని నిపుణుల సూచనలు మేరకు దీనిని ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. చుట్టూ చెరువు, గట్టు పైన కొబ్బరి చెట్లు, ఆహ్లాదకరమైన ఇతర చెట్ల నడుమ వాకింగ్ ట్రాక్ ఉండటం నడక సమయంలోను ప్రకృతి సహజ సిద్ధమైన గాలులు ఆస్వాదించేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఈ ట్రాక్‌ను విద్యార్థులే కాకుండా స్థానిక వాకర్స్ కూడా ఉపయోగించుకోవచ్చునని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు రామరాజు, ఎస్‌వీ రంగరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణమరాజు, డాక్టర్ బీహెచ్‌వీఎస్ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. పేరుపాలెం బీచ్‌కు వెళ్లే సందర్శకులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు రాకతో అమ్మవారి ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: నరసాపురం డిపో పరిధిలో ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం డీఎం ఎస్.సుబ్బన్నరెడ్డి ఆదివారం విలేకరులకు చెప్పారు. డిపో పరిధిలోని నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, యలమంచిలి, పెనుగొండ ప్రాంతాల ప్రజలు సమస్యలు, సూచనలను ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ 99592 25486కు ఫోన్ చేసి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. బస్సు సర్వీసులు, ప్రధానంగా ఉన్న సమస్యలు, కార్గో సేవలపై ఫిర్యాదులు, సూచనలు ఇవ్వాలని కోరారు.

స్నేహితుడికి పూర్వ విద్యార్థుల అండ



సిద్ధాంతంలో స్నేహితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వవిద్యార్థులు

పెనుగొండ: సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు స్నేహితుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆర్థికంగా అండగా నిలిచారు. సిద్ధాంతానికి చెందిన దేవానీ శ్రీనివాస్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండంతో రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), సీహెచ్ నాగరాజు, పి.పోతు రాజు, జి.బాబూరావు, కె.సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పెనుమంట్రలో శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చునని పశ్చిమ గోదావరి జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షులు రుద్రరాజు పెద్దివర్మ అన్నారు. ఆదివారం పెనుమంట్ర పిరిమిడ్ ధ్యాన శిక్షణ కేంద్రంలో ఉపసర్పంచ్ భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన మెగా మహాకరుణ–శాకాహారుల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ శాకాహార ప్రాధాన్యతను తెలిపారు. ముందుగా పెనుమంట్ర, గరువు, బ్రాహ్మణచెర్వు గ్రామాలలో 15 కిలోమీటర్ల మేర శాకాహార ర్యాలీని నిర్వహించి పిరిమిడ్ కేంద్రంలో ఉచిత ధ్యాన శిక్షణ, సంగీత నాద జ్ఞానం, చిన్నారులతో సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పిరిచ్యువల్ సైన్స్ అకాడమి చైర్మన్ డాక్టర్ ప్రతాప్‌కుమార్, సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, జిల్లా శాకాహార ర్యాలీ కన్వీనర్ కేవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

సాహితీవేత్త పెంకికి సత్కారం

ఆకివీడు: కవి సమ్మేళనంలో తన కవితా గానాన్ని విన్పించి, ప్రేక్షకుల్ని ఆనందింపజేశారు ఉపాధ్యాయులు, సాహితీవేత్త పెంకి విజయ్ కుమార్. తాడేపల్లి గూడెంలో శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ప్రపంచ తెలుగు సాహిత్య–కళా ఉత్సవాలు జరిగాయి. ఉత్సవాల్లో పాల్గొని వచన కవిత 'ముళ్ల కిరీటాలు'ను విన్పించి ప్రేక్షకుల్ని ఉత్తేజపరిచిన పెంకిని కళా సమితి అంతర్జాతీయ నిర్వాహకులు కత్తిమండ ప్రతాప్ తదితరులు సత్కరించినట్లు ఆయన విలేకర్లకు తెలిపారు. సామాజిక కార్యకర్తలు ఆర్థికంగా బలోపేతమైతే, ప్రజలు మరింత చైతన్యవంతులయ్యే విధంగా సేవలందిస్తారని ముళ్ల కిరీటాలు సారాంశమని పెంకి వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధ్యాయులు, సాహితీ అభిమానులు అభినందించారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ధర్మాపుర అగ్రహారంలో సోమవారం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వార్డు కౌన్సిలర్ కటికతల జాన్ వెస్లీ ఆదివారం చెప్పారు. గ్రామానికి చెందిన సుప్రీంకోర్టు మాజీ జడ్జి స్వర్గీయ కటికతల రామస్వామి విగ్రహావిష్కరణ, విశ్రాంతి భవనం, ధర్మాపురం స్వాగత బోర్డుల్ని ఆవిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా అదనపు డీజీ పీ.వీ.సునిల్ కుమార్ హాజరవుతారని వెస్లీ చెప్పారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన

పోడూరు: పోడూరులో ప్రభుత్వ నిధులు రూ.25 లక్షల వ్యయంతో చేపట్టిన కాపు కమ్యూనిటీహాలు నిర్మాణప నులకు ఆదివారం రాష్ట్ర మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక కాపు సంఘం నాయకులతో మాట్లాడుతూ కమ్యూనిటీహాలు భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తామని, నిర్మాణం పూర్తయ్యాక పై అంతస్తు నిర్మాణానికి కూడా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, గ్రామసర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ చేకూరి సూరిబాబు, పోతుమూరి రామచంద్రరావు, దేవస్థానం చైర్మన్ పోడూరి సత్యసాయిబాబా, సొసైటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు, కాపుసంఘం అధ్యక్షుడు అడపా శంకరరావు, నాయకులు జడ్డు కృష్ణారావు, జడ్డు చిన జోగేశ్వరరావు, ఉగ్గిరాల కాశీ, ఉగ్గిరాల చంటి తదితరులు పాల్గొన్నారు.



పోడూరులో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

అమ్మవారిని దర్శించుకున్న రంగనాథరాజు

గుమ్మలూరు శివారు రావిగొప్పులో విజయదుర్గ అమ్మవారిని ఆదివారం మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. సర్పంచ్ గొట్టుముక్కల సోనియారమేష్, ఎంపీటీసీ సభ్యురాలు పోతాబత్తుల శ్రీలక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి మాజీ మంత్రి రంగనాథరాజు ఆపన్న హస్తం

పెనుగొండ: విధి వక్రీకరించడంతో కొడుకు , కోడలు, భర్తను పోగొట్టుకొని లేవలేని వయస్సులో మనమళ్లను సాకుతున్న అవ్వకు అండగా నిలిచి ప్రతి నెలా రూ.10 వేలు అందిస్తూ మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మనసున్న మారాజుగా అభినందనలు అందుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గొల్లపల్లి బాలకృష్ణ, ఇతర గ్రామస్థులు తెలిపిన వివరాలు ప్రకారం ఆచంట మండలం అయోధ్యలంక పెదపేటకు చెందిన బొంతు వెర్రమ్మ భర్త, కొడుకు, కోడలు స్వల్ప వ్యవధిలోనే మృతి చెందడంతో పూర్తిగా నిరాశ్రయులై ఆర్థిక భారంతో కుంగిపోయింది. బాధితుల వెతలు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో గత ఆగస్టు నుంచి ప్రతి నెలా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. వెర్రమ్మకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ రూ.2750కి తోడుగా, శ్రీరంగనాథరాజు అందిస్తున్న రూ.10 వేలుతో కలిపి మనమళ్లు ప్రణ్ కుమార్, సతీష్‌లను సాకుతున్నాని వెర్రమ్మ ఆనందంగా తెలిపింది. ఈ మేరకు డిసెంబర్ నెలకు సంబంధించి సొమ్మును ఆదివారం నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యుడు కంచుస్థంభం శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టరు మానుకొండ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గొల్లపల్లి బాలకృష్ణ, జె.సత్యనారాయణ, కడలి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



అయోధ్యలంకలో రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న నాయకులు

ఢిల్లీకి తరలివెళ్లిన మాల మహానాడు నాయకులు

పాలకొల్లు అర్బన్: ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన ఏ రాజకీయ పార్టీ అయినా మనుగడ కోల్పోవడం ఖాయమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పీవీ రావు మాలమహానాడు ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీకి పిలుపు ఇచ్చినట్లు ఆయన అన్నారు. ఈ మేరకు పాలకొల్లు నుంచి ఆదివారం పలువురు మాలమహానాడు నాయకులు బయలుదేరి వెళ్లారు. ఈ నెల 19న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పందు అశోక్‌బాబు నాయకత్వంలో ధర్నా చేపట్టినట్లు తెలిపారు. కొమ్రపాటి వీరాస్వామి, దేవ రాజేష్‌కుమార్, కోరం ముసలయ్య, వడ్లపాటి సురేష్ తదితరులు ఢిల్లీ వెళ్లిన వారిలో ఉన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యుని కల్యాణోత్సవాలు

పెనుగొండ: మండలంలోని నడిపూడిలోని ప్రసిద్ధి చెందిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, హోమాలు, బలిహారణలు నిర్వహించారు. అనంతరం మన్నే వెంకట నారాయణ కుటుంబికులు వడ్లపూడి సురేష్, శ్రీవల్లీ రాజరాజేశ్వరి దంపతులు వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెనుగొండలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో చెట్లపల్లే శరవణ్‌కుమార్, జగన్నాథకీర్తి చంద్రికలు, ఆచంట మండలం కొడమంచిలిలోని సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో మన్నే కృష్ణ ప్రసాద్ దంపతులు, వడలి సుబ్బారాయుడు పుంతలో ఆలయంలో తణుకుకు చెందిన కానూరి రాంబాబు, మహాలక్ష్మి దంపతులు కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం నడిపూడిలో బాణసంచా కాల్పులు, మేళతాళాలు, కరతాళ నృత్యాలతో నూతన వధూవరులతో గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామునుంచి నడిపూడి, పెనుగొండ, వడలి, సిద్ధాంతం, దేవల్లో సుబ్రహ్మణ్య షష్ఠి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని నడిపూడి, ఆచంట మండలం కొడమంచిలిల్లోని ఆలయాల్లో సోమ వారం ఉదయం 11 గంటలకు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పూజలు నిర్వహించనున్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలో వివిధ దేవాలయాలలో షష్ఠి మహోత్సవాలు సందర్భంగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. జుత్తిగ శ్రీఉమావాసుకిరవి సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆలయ అర్చకులు కొండవీటి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సామూహిక కల్యాణోత్సవాలు నిర్వహించారు. పెనుమంట్ర గోస్తనీ తీరంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి వేదపండితులు చిట్టా రవిశర్మ ఆధ్వర్యంలో తేతలి వెంకట సుబ్బారెడ్డి శారదా దంపతులు, బ్రాహ్మణచెర్వు మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి వెంకట సత్యనారాయణరెడ్డి, లక్ష్మీకాంతం దంపతులు కల్యాణోత్సవాలు జరిపారు. నెగ్గిపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మల్లిడి విజయ కోనాల వెంకటరెడ్డి సత్తి రామకృష్ణారెడ్డి దంపతులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు నిర్వహించారు.



నడిపూడిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



జుత్తిగలో రవిసోమేశ్వరస్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ

నరసాపురం రూరల్: సుబ్రమణ్యేశ్వర స్వామి వారి షష్ఠి సందర్భంగా మండలంలోని లక్ష్మణేశ్వరం దుర్గాలక్ష్మణేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం శ్రీవల్లి దేవసేవ సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయం శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చాగంటి మురళీకృష్ణ, శ్రీదేవి, చాగంటి పార్థసారధి–లక్ష్మి దంపతులు పాల్గొని కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు యలమంచిలి ప్రసాదశర్మ, మంచి ప్రసాదరశర్మ ల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీవల్లి దేవసేవ సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ చాగంటి సురేష్‌నాయుడు, ఆలయ చైర్మన్ కంకటాల పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో క్రిస్మస్ సందడి షురూ



పెనుమంట్ర: విద్యుత్ దీపాలంకరణలో సుందరంగా ఉన్న లూథరన్ దేవాలయం



పోడూరు: జిన్నూరు పెదపేటలో విద్యుత్‌కాంతులతో లూథరన్ చర్చి

పెనుమంట్ర: పల్లెల్లో క్రిస్మస్ వేడుక సందడి నెలకొంది. డిసెంబర్ మొదటి వారం నుంచి జనవరి 1 వరకు గ్రామాల్లోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకుంటూ ఉంటారు. మండలంలో లూథరన్ చర్చిలకు సంబంధించి పెనుమంట్ర, పొలమూరు, మార్టేరు గ్రామాలలో ప్రధాన సెంటర్‌లుగా ప్యారీస్ క్రైస్తవ దేవాలయాలు ఉన్నాయి. వివిధ గ్రామాలలో లూథరన్ చర్చిలు ఉండగా, కొన్ని గ్రామాలలో పెంతెకోస్తు, బైబిల్‌మిషన్, గోదావరి డెల్టామిషన్(జీడీఎం), చర్చిలు కూడా ఉన్నాయి. అన్ని చర్చిలలో నెలరోజుల పాటు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా చర్చిల వద్ద ఏర్పాటు విద్యుత్ దీపాలంకరణలో అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

పోడూరులో..

పోడూరు: క్రిస్మస్ పండుగ సమీపించడంతో గ్రామాల్లో చర్చిలు విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి. చర్చిల వద్ద పశువుల పాకలు వేసి క్రీస్తు జనన ఘట్టాన్ని కళ్లకు కట్టేలా బొమ్మలు ఏర్పాటు చేశారు. పలు చర్చిలలో ఇప్పటికే క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి.

దారి సమస్య పరిష్కారానికి కృషి



కొంతేరులో సమస్యను పరిశీలిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు

పాలకొల్లు అర్బన్: చర్చి సంఘస్తులకు, రైతులకు మధ్య గత కొంతకాలంగా నలుగుతున్న దారి సమస్యను ఉభయులకు సానుకూలంగా పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. యలమంచిలి మండలం కొంతేరు శివారు ఆకులవానిగరువు చర్చి సంఘస్తులను ఆదివారం ఆయన స్వయంగా కలుసుకున్నారు. సంఘస్తులు ఎదుర్కొంటున్న దారి సమస్యను స్వయంగా పరిశీలించారు. ఇప్పటికే ఈ దారి విషయంలో ఉన్న పోలీసు, కోర్టు కేసు వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

లంక చిరంజీవికి పరామర్శ

అనంతరంవైఎస్సార్‌సీపీ నాయకుడు లంక చిరంజీవి తండ్రి బాబూరావు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో విషయం తెలుసుకుని గోపి చిరంజీవి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని బాబూరావు శవపేటికను గోపి మోశారు. ఈ కార్యక్రమాల్లో జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలుకొండ ఏలియాభక్త సింగ్, నిమ్మకాయల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.